# అకాల వర్షం.. అపార నష్టం

**200ల ఎకరాల పంట నష్టం**
**పంటలను పరిశీలించిన అధికారులు**
**ఆదుకోవాలని రైతుల వేడుకోలు**

యాచారం, ఏప్రిల్15: మండలంలో అకాల వర్షాలకు అపార నష్టం వాటిల్లింది. సోమవారం సాయంత్రం మండలంలో కురిసిన ఈదురుగాలులతో కూడిన వడగళ్ల వర్షానికి పంటలు తీవ్రంగా నష్టపోయాయి. ముఖ్యంగా మామిడి, వరి, టమాట పంటలకు నష్టం వాటిల్లింది. నష్టపోయిన పంటలను మంగళవారం వ్యవసాయ అధికారులు పరిశీలించారు. మండల వ్యవసాయ అధికారి రవినాథ్ వ్యవసాయ విస్తరణ అధికారులతో కలిసి పంటలను పరిశీలించారు. మండలంలోని మేడిపల్లి, తాటిపర్తి, మంథన్‌గౌరెల్లి, సుల్తాన్‌పూర్, చింతపట్ల, మొండిగౌరెల్లి గ్రామాలలో పర్యటించి నష్టపోయిన పంటలను అంచన వేశారు. మండలంలో మొత్తం 200ల ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లినట్లు అధికారులు పేర్కొన్నారు.


పంటలను పరిశీలిస్తున్న అధికారులు
వడగళ్ల వానకు నేలరాలిన వడ్లు

మొత్తం 20 నుంచి 50శాతం వరకు పంట నష్టం జరిగినట్లు తెలిపారు. మామిడి పంటలు ఈదురుగాలులకు నేలరాలినట్లు రైతులు అధికారులకు విన్నవించారు. టమాట తోటలు వడగళ్ల వానకు దెబ్బతిన్నట్లు రైతులు పేర్కొన్నారు. నష్టపోయిన పంటలకు తగిన పరిహారం చెల్లించాలని రైతులు విజ్ఞప్తి చేశారు. నష్టపోయిన పంటల నివేదికను తయారు చేసి ప్రభుత్వానికి నివేదిక అందజేసి తగిన పరిహారం అందించేందకు అన్ని విధాలుగా కృషి చేయనున్నట్లు అధికారులు తెలిపారు.


ఈదురుగాలులకు నేలరాలిన మామిడి

# రజతోత్సవ సభను విజయవంతం చేద్దాం

**ఇబ్రహీంపట్నం మాజీ ఎంపీపీ కృపేశ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బుగ్గరాములు**
**ఇబ్రహీంపట్నం మండలస్థాయి కార్యకర్తల సమావేశం**


సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ మండల నాయకులు

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 15 : బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు లక్షలాదిగా తరలివెళ్లి విజయవంతం చేద్దామని బీఆర్‌ఎస్ ఇబ్రహీంపట్నం మండల అధ్యక్షుడు చిలుకల బుగ్గరాములు, ఇబ్రహీంపట్నం మాజీ ఎంపీపీ కృపేశ్ అన్నారు. మంగళవారం ఇబ్రహీంపట్నం బీఆర్‌ఎస్‌పార్టీ కార్యాలయంలో మండలస్థాయి కార్యకర్తలు, నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈనెల 27న వరంగల్ నగరంలో నిర్వహించనున్న బీఆర్‌ఎస్‌పార్టీ రజతోత్సవ ఉత్సవాలకు ఇబ్రహీంపట్నం మండలం నుంచి రెండువేల మందితో తరలివెళ్లనున్నట్లు తెలిపారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేసిన మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి సారథ్యంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు స్వచ్ఛందంగా తరలిరావాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఎమ్మెల్యే ప్రజా సమస్యలపై కన్నెత్తి చూడకుండా దొరపాలన కొనసాగిస్తున్నారని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, సహకార సంఘం చైర్మన్ వెంకట్‌రెడ్డి, నాయకులు జగన్నాథం, గంగిరెడ్డి బల్వాంత్‌రెడ్డి, శ్రీశైలం, నరేందర్‌రెడ్డి, యాదగిరి, బీరప్ప, శంకరయ్య, రాముయాదవ్, గణేష్, నర్సింహ, గోపాల్, శ్రీనివాస్‌రెడ్డి, ప్రసాద్‌గౌడ్, భగీరథ, నర్సింహ, రమేశ్, ఐలేశ్, బాలుగౌడ్, శ్రీనివాస్, ఆంజనేయులు, శేఖర్, యాదగిరి, అంజయ్య, భాషా, ప్రేమ్‌కుమార్, శేఖర్‌గౌడ్, దేవేందర్‌గౌడ్, శ్రీనివాస్, కుమార్ పాల్గొన్నారు.

**స్వచ్ఛందంగా తరలిరండి**

మొయినాబాద్ : రజతోత్సవ సభకు పెద్ద ఎత్తున స్వచ్ఛందంగా తరలిరావాలని బాకారం మాజీ సర్పంచ్ కొత్తపల్లి రాఘవారెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ కుమ్మరి రాము అన్నారు. ఈ నెల 27వ తేదీన వరంగల్‌లో నిర్వహించ తలపెట్టిన రజతోత్సవ మహాసభకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను మంగళవారం ఎన్కేపల్లిలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పార్టీ ఏర్పాటై 25 ఏండ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా రజతోత్సవాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. మహాసభలో పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేయడంతో పాటు ప్రజల పక్షాన ఉండి ప్రజా సమస్యలపై పోరాట గళాన్ని వినిపించనున్నట్లు చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. వరంగల్‌లో నిర్వహించే సభకు పెద్ద ఎత్తున తరలిరావాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎన్కేపల్లి బీఆర్‌ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కరంచంద్, బీఆర్‌ఎస్ యువజన విభాగం నాయకులు అరవింద్, నాయకులు శ్రీనివాస్, రవీందర్, ప్రవీణ్‌రెడ్డి, విఘ్నేష్, మధు, నరసింహ, రాకేష్ పాల్గొన్నారు.


మొయినాబాద్: ఎన్కేపల్లిలో వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

# దేవునిపల్లిలో నేలకొరిగిన బొప్పాయితోట

షాద్‌నగర్, ఏప్రిల్ 15: షాద్‌నగర్ నియోజకవర్గంలో అకాలంగా కురిసన వర్షానికి పంటలు దెబ్బతినడంతో పాటు భారీ ఈదురుగాలులకు చెట్లు నేలకొరిగాయి. ఫరూఖ్‌నగర్ మండలంలోని దేవునిపల్లిలో నేలకొరిగిన బొప్పాయితోట నేలకొరగగా కొందుర్గులో పిడుగుపాటుకు ఓ మృత్యువాత పడింది. కేశంపేట మండలంలోని పాపిరెడ్డిగూడ గ్రామంలో చెట్లు నేలకూలి విద్యుత్ తీగలపై పడ్డాయి. దేవునిపల్లికి చెందిన రైతు జంగయ్య నాలుగు ఎకరాల్లో బొప్పాయి తోటను సాగు చేశాడని, అకాలంగా వీచిన భారీ ఈదురుగాలులతోకూడిన వర్షంలో చెట్లు నేలకొరిగినట్లు బోరున విలపిస్తున్నాడు.


దేవునిపల్లిలో నేలకొరిగిన బొప్పాయితోట

**కొందుర్గులో..**

కొందుర్గు మండలంలో భారీ ఈదురుగాలులతో కూడిన వర్షానికి పంటలు దెబ్బతిన్నాయి. భైరంపల్లి, మహదేవ్‌పూర్, ముట్పూర్‌లో మొక్కజొన్న పంట నేలకొరిగింది. పలు గ్రామాల్లో మామిడి కాయలు నేలరాలినట్లు రైతులు తెలిపారు. వర్షంలో పిడుగు పడడంతో శ్రీరంగపూర్ గ్రామానికి చెందిన లాలయ్య అనే రైతుకు చెందిన ఎద్దు మృత్యువాత పడింది. ఎంకిర్యాల గ్రామానికి చెందిన రవి అనే రైతు నిర్మించుకున్న రేకుల షెడ్డు గాలికి ఎగిరిపోయింది. ప్రభుత్వం స్పందించి రైతులను ఆదుకోవాలని వేడుకుంటున్నారు.


కొందుర్గులో నేలరాలిన మామిడి


కేశంపేట మండలం పాపిరెడ్డిగూడలో రహదారిపై నేలకొరిన చెట్టు



## ఈదురుగాలులు.. కూలిన చెట్లు

కేశంపేట, ఏప్రిల్ 15: కేశంపేటలో మండలంలో మంగళవారం మధ్యాహ్నం భారీ ఈదురుగాలులు వీచాయి. దీంతో పెద్దఎత్తున పాపిరెడ్డిగూడ గ్రామంలో చెట్లు సైతం విరిగిపడ్డాయి. విద్యుత్ తీగలపై పడడంతో విద్యుత్ స్తంభం పక్కకు ఒరిగింది. దీంతో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడిందని స్థానికులు తెలిపారు.

# కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి

కడ్తాల్, ఏప్రిల్ 15: మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. మంగళవారం తలకొండపల్లి మండల పరిధిలోని పడకల్‌లో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన, మొక్కజొన్న-పొద్దు తిరుగుడు కొనుగోలు కేంద్రాన్ని పీఏసీఎస్ చైర్మన్ కేశవరెడ్డి, ఏఎంసీ చైర్‌పర్సన్ గీతా ముదిరాజ్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. రైతులు పంటలను కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని తెలిపారు. అనంతరం పలువురి లబ్ధిదారులకు వ్యవసాయ పనిముట్లను అందజేశారు. అకాల వర్షానికి నష్టపోయిన పంటల వివరాలను సేకరించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈవో ప్రతాప్‌రెడ్డి, ఏడీఏ శోభారాణి, ఏవో రేణుకాచక్రవర్తి, ఏఎంసీ, పీఏసీఎస్ డైరెక్టర్లు ఆజీమ్, శ్రీనివాస్, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, యాదయ్య, జగ్గారెడ్డి, హరిమోహన్‌రెడ్డి, శ్రీశైలం, ఆరీఫ్ పాల్గొన్నారు.


పడకల్ గ్రామంలో మొక్కజొన్న కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి




## కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

ఆమనగల్లు, ఏప్రిల్ 15: ఆమనగల్లు పట్టణంలోని ప్రభుత్వ దవాఖానలో మంగళవారం లయన్స్‌క్లబ్ ఆఫ్ ఆమనగల్లు, రాంరెడ్డి లయన్స్ ఐ హాస్పిటల్ ఆధ్వర్యంలో సంయుక్తంగా నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. కంటి వైద్యుడు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో 72 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, ఇందులో 40 మందికి దృష్టి లోపం ఉన్నట్లు గుర్తించి ఐఓఎల్ ఆపరేషన్ నిమిత్తం రాంరెడ్డి లయన్స్ ఐ ఆస్పత్రికి తరలించినట్లు పీఆర్‌వో పాషా తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, కార్యదర్శి మహేశ్, ప్రభుత్వ దవాఖాన సిబ్బంది పాల్గొన్నారు.

**మజీదుమామిడిపల్లిలో..**

నందిగామ : మండల పరిధిలోని మజీదుమామిడిపల్లిలో మంగళవారం విజయ కార్డియాక్, మెటర్నిటీ, జనని చిన్న పిల్లల దవాఖాన ఆధ్వర్యంలో డాక్టర్లు చందులాల్, విజయ పర్యవేక్షణలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో 221మందిని పరిశీలించి వివిధ రకాల వైద్య పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

# పేదలకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలి



అబ్దుల్లాపూర్‌మెట్, ఏప్రిల్ 15 : ఇండ్లు లేని పేద కుటుంబాలకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ దళిత యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గౌరెల్లి గ్రామస్తులు మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వేనం 238లో 84 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని, ఇందులో 26ఎకరాల 27 గుంటల భూమిని వ్యవసాయం కోసం లావణి పట్టాలు ఇచ్చారని తెలిపారు. మిగతా వ్యవసాయానికి పనికిరాని 57 ఎకరాల 13 గుంటల భూమి ఉందని పేర్కొన్నారు. ఈ మిగులు భూమిని సర్వే చేసి ఇండ్లులేని పేద కుటుంబాలకు 120 గజాల చొప్పున కేటాయించి పట్టా సర్టిఫికెట్లు ఇవ్వాలని కోరారు. ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి ప్రభుత్వం ఇదే సర్వేనంబర్‌లో 1500 మంది పేదలకు ఇందిరమ్మ ఇండ్ల పట్టాలు మంజూరుచేసి ఇండ్లు కూడా నిర్మించిందని తెలిపారు. మిగతా 1909 మంది పేదల వద్ద అప్పటి సర్టిఫికెట్లు అలానే ఉన్నాయని, వారికి ఇప్పటి వరకూ స్థలం చూపించలేదని వివరించారు. తమ సమస్యలను పరిశీలించి ఒక్కొక్కరికీ 120 గజాల స్థలాన్ని కేటాయించి పట్టా సర్టిఫికెట్లు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో దళిత యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు నరసింహ, గ్రామస్తులు యాదమ్మ, రత్నమ్మ, చెన్నమ్మ, రమేష్, లాలు, సైదులు, అరుణ, మాధవి, చిట్టి తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక సాయం అందజేత



కడ్తాల్, ఏప్రిల్ 15: తలకొండపల్లి మండల పరిధిలోని పడకల్ గ్రామానికి చెందిన లక్ష్మమ్మ అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందింది. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ నాయకులు, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు, మంగళవారం ఉదయం లక్ష్మమ్మ మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబానికి మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్ రూ.3 వేలు అందించగా, వాలీబాల్ యూత్ అధ్యక్షుడు మల్లేశ్ రూ.3వేలు అందజేశారు. పరామర్శించిన వారిలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు శంకర్, మాజీ సర్పంచ్ శంకర్‌నాయక్, నాయకులు అంజయ్యగౌడ్, బాలకిష్టయ్య, రవి, లక్ష్మయ్య, స్వామిగౌడ్, శ్రీశైలం, మహేశ్, మల్లేశ్, హరికృష్ణ తదితరులు ఉన్నారు.

## వానరానికి అంత్యక్రియలు


వానరాన్ని స్మశాన వాటికకు తీసుకెళ్తున్న గ్రామస్తులు

కడ్తాల్, ఏప్రిల్ 15: నిత్యం తమ మధ్య తిరిగే వానరం ఆకస్మికంగా మరణించడంతో గ్రామస్తులు వానరానికి ఘనంగా అంత్యక్రియలు నిర్వహించారు. ఈ ఘటన కడ్తాల్ మండల పరిధిలోని రావిచేడ్ గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామంలో కొన్ని రోజులుగా వానరం తిరుగుతూ అందరితో కలిసి మెలసి ఉండేది. మంగళవారం ఉదయం గ్రామంలోని హనుమాన్ ఆలయంలో వానరం అకస్మాత్తుగా చనిపోయింది. విషయం తెలుసుకున్న సీతారామాంజనేయస్వామి భజన మండలి సభ్యులు, గ్రామస్తులు వానరాన్ని బ్యాండ్ మేళాల మధ్య ఊరేగింపుగా తీసుకెళ్లి స్థానిక స్మశాన వాటికలో ఖననం చేశారు.



# పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

షాద్‌నగర్‌టౌన్, ఏప్రిల్ 15: పౌష్టికాహారంతో చిన్నారులకు సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయలక్ష్మి అన్నారు. పోషణ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఫరూఖ్‌నగర్ మండలం లింగారెడ్డిగూడ అంగన్‌వాడీ-2లో మంగళవారం పోషణ పక్షం కార్యక్రమాన్ని అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలు అమృత ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోషకాహారంతో రోగాల బారిన పడకుండా ఆరోగ్యంగా ఉంటారన్నారు. అదే విధంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం స్నాతకోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అర్జున్‌కుమార్, ఆశ కార్యకర్త సరళ పాల్గొన్నారు.



అబ్దులాపూర్‌మెట్ మండల పరిధిలోని అనాజ్‌పూర్‌లోని సర్వే నంబర్ 274, 275, 76, 77, 78, 281లో 125 మందికి వెంటనే పట్టా పాసుపుస్తకాలు మంజూరు చేసి ఆదుకోవలని కోరుతూ మంగళవారం సీపీఎం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి యాదయ్య ఆధ్వర్యంలో కలెక్టర్ నారాయణరెడ్డికి వినతి పత్రం అందజేసి కలెక్టరేట్ ఎదుట నినాదాలు చేస్తున్న సీపీఎం నాయకులు.

- ఆదిబట్ల, ఏప్రిల్ 15

# ఫుట్‌పాత్‌లను ఆక్రమిస్తే కఠిన చర్యలు

చేవెళ్లటౌన్, ఏప్రిల్ 15: ఫుట్ పాత్‌లను ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని చేవెళ్ల డివిజన్ ట్రాఫిక్ సీఐ వెంకటేశం, మున్సిపాల్ అధికారులు తెలిపారు. చేవెళ్ల మున్సిపల్ కేంద్రంలో చేవెళ్ల బస్టాండ్ నుంచి షాబాద్ చౌరస్తా వరకు బీజాపూర్ రహదారిపై రోడ్డుకు ఇరువైపులా ఫుట్‌పాత్‌పై బోర్డ్‌లు, టీ కొట్లు, ఏర్పాటు చేసిన నూడిల్స్ డబ్బాలను మంగళవారం చేవెళ్ల ట్రాఫిక్ సీఐ వేంకటేశం, చేవెళ్ల మున్సిపల్ అధికారులు సిబ్బందితో తొలగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేవెళ్ల బీజాపూర్ రహదారికి ఇరువైపులా ఫుట్‌త్‌ను ఆక్రమించి బోర్డులను ఏర్పాటు చేయడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుందన్నారు. వ్యాపారులు ఫుట్‌పాత్ మీద ఎటువంటి చిరువ్యాపారాలు ఏర్పాటు చేసినా చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది, మున్సిపాల్ అధికారులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.




# ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలి

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 15 : ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించాలని రోటరీక్లబ్ హైదరాబాద్ నార్త్ ఫౌండేషన్ సభ్యులు వెంకట మురళి అన్నారు. ఇబ్రహీంపట్నం మండలం ముకునూరు గ్రామంలో మంగళవారం ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించాలని కోరుతూ.. మహిళలకు ప్లాస్టిక్ రహిత సంచులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ప్రతిఒక్కరూ ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని కోరారు. ప్లాస్టిక్ వాడకంపట్ల జరిగే అనార్థాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని సూచించారు. ప్లాస్టిక్ సంచులను పూర్తిగా నిషేధించాలని, ప్రతి ఇల్లు ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దే బాధ్యత మహిళలపై ఉందన్నారు. అనంతరం గ్రామంలో నీటి సమస్య తలెత్తిందని, నీటి సమస్య పరిష్కారం కోసం కృషిచేయాలని కోరటంతో గ్రామానికి ఫౌండేషన్ తరుపున రూ.లక్ష అందజేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్వీ మండల నాయకుడు సన్నాయి ప్రేమ్‌కుమార్, నాయకులు జంగయ్య, మహేందర్, సతీశ్, రాజు, మహేందర్ ఉన్నారు.




## చలివేంద్రాల ఏర్పాటు

కేశంపేట, ఏప్రిల్ 15: మండల పరిధిలోని సంతాపూర్ గ్రామానికి చెందిన యువ నాయకుడు నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. గ్రామంలో గత 5ఏళ్లుగా వేసవిలో ప్రజలకు తాగునీటిని అందజేస్తున్నానన్నారు.కార్యక్రమంలో అమ్రేశ్, అంజయ్య, వెంకటేశ్, వేణుగోపాల్‌రెడ్డి, రాజు, భద్రప్ప పాల్గొన్నారు.

**మోకిలాలో..**

చేవెళ్ల రూరల్ : చలివేంద్రాన్ని గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మోకిలా పంచాయతీ కార్యదర్శి ఎల్లయ్య సూచించారు. మంగళవారం శంకర్‌పల్లి మండల పరిధి మోకిలా గ్రామ పంచాయతీ ఆవరణలో పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సెక్రటరీ ఎల్లయ్య, పంచాయతీ సిబ్బందితో కలిసి ప్రారంభించారు. జిల్లా పంచాయతీ అధికారి సురేశ్ మోహన్ ఆదేశాల మేరకు చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## పని కల్పిస్తామని బంగారం, నగదు చోరీ

నందిగామ, ఏప్రిల్ 15: పని కల్పిస్తామని ఇద్దరు మహిళలను తీసుకెళ్లి బంగారం, నగదు దొంగిలించిన ఘటన మంగళవారం కొత్తూరు, నందిగామ పోలీస్ స్టేషన్ల పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొత్తూరుకు చెందిన విజయ, సత్తమ్మ ఇద్దరు మహిళలు కూలీ పనులకోసం కొత్తూరులోని లేబర్ అడ్డా వద్దకు వచ్చారని, అక్కడకు గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి పని కల్పిస్తామని చెప్పి ఇద్దరిని బైక్‌పై తీసుకెళ్లి పెంజర్ల సమీపంలోని నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లి అక్కడ మరో వ్యక్తితో కలిసి మహిళల మెడలో ఉన్న పుస్తెలతాడు, రూ.5వేల నగదును లాక్కొని అక్కడి నుంచి పారిపోయినట్లు తెలిపారు. బాధిత మహిళలు పోలీసులను ఆశ్రయించడంతో పోలీసులు రంగంలోకి దిగి ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి సీసీ కెమెరాలను పరిశీలించి దుండగులకోసం గాలింపు చేస్తున్నట్లు నందిగామ సీఐ ప్రసాద్ తెలిపారు.

# నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

**వ్యవసాయ శాఖ ఏడీఏ శోభారాణి**

ఆమనగల్లు. ఏప్రిల్ 15: విత్తనాల డీలర్లు వ్యవసాయ శాఖ నియమ నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని వ్యవసాయ శాఖ ఏడీఏ శోభారాణి డీలర్లకు సూచించారు. పట్టణంలోని రైతు వేదిక భవనంలో డివిజన్ లెవల్ విత్తన, పురుగు మందులు, ఎరువుల డీలర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏడీఏ శోభారాణి మాట్లాడుతూ విత్తన డీలర్లు విధిగా రైతులు విత్తనాలు కొనుగోలు చేసిన వెంటనే దానికి సంబంధించిన బిల్లులను రైతులకు అందించాలన్నారు. విత్తనాల లైసెన్స్ వివరాలు, ధరల పట్టికను ఏర్పాటు చేయాలన్నారు. విత్తనాలు కొనుగోలు చేసిన రైతుల వివరాలను రిజిస్టర్‌లో పొందుపర్చాలని సూచించారు. డీలర్లు నకిలీ విత్తనాలు అమ్మితే వారిపై కఠిన చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. సమావేశంలో వ్యవసాయ శాఖ అధికారులు శ్రీనివాస్‌గౌడ్, అరుణకుమారి, రేణుకా చక్రవర్తిని, శ్రీలత, డివిజన్ ఏఈవోలు, డీలర్లు పాల్గొన్నారు.

